


# మన దునియా

Our News Our World

RNI Number
TELTEL/2023/85680

మన అక్షరం - మన ప్రపంచం








సంపుటి : 3 | సంచిక : 282 | జూన్ 9 మంగళవారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-


## దేశాన్ని విడదీయొద్దు..

# రేవంత్ రెడ్డి కి 'ఇండీ' మిత్రపక్షం హితవు!





- ప్రధాని, రాష్ట్రపతి ఇద్దరూ ఉత్తర భారత్‌కు చెందినవారేనన్న రేవంత్ రెడ్డి
- దక్షిణ భారత ప్రజలు రెండో శ్రేణి పౌరులుగా ఉండలేరని వ్యాఖ్య
- రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను తప్పుబట్టిన శివసేన(యూబీటీ)
- యుద్ధం వస్తే భారతీయులుగానే పోరాడతామని ఉద్బోధ
- ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం కాకూడదని హితవ

శివసేన (యూబీటీ)



దేశాన్ని విడదీయొద్దు.. రేవంత్ రెడ్డి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల ఓ కార్యక్రమంలో చేసిన 'ఉత్తర-దక్షిణ భారత' వ్యాఖ్యలపై 'ఇండీ' కూటమి మిత్రపక్షం శివసేన (యూబీటీ) తీవ్రంగా స్పందించింది. దేశాన్ని రాష్ట్రాల వారీగా ముక్కలు చేసేలా మాట్లాడటం ఏమాత్రం సరికాదని హితవు పలికింది. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న రేవంత్ రెడ్డి ప్రాంతీయ విభేదాల కంటే జాతీయ ఐక్యతకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. ఈ వివాదంపై శివసేన (యూబీటీ) అధికార ప్రతినిధి ఆనంద్ దూబే మాట్లాడుతూ.. "మన భారతదేశం ఓ అందమైన పూలగుచ్ఛం లాంటిది. అందులో ఒక్కో పువ్వు ఒక్కో రంగులో, ఒక్కో సువాసనతో ఉంటుంది. కానీ అవన్నీ కలిస్తేనే ఒక అందమైన గుచ్ఛం అవుతుంది" అని దూబే వ్యాఖ్యానించారు. భౌగోళిక, భాషా వ్యత్యాసాలతో సంబంధం లేకుండా ప్రతి రాష్ట్రానికి సమాన గౌరవం దక్కాలని ఆయన స్పష్టం చేశారు. పాకిస్థాన్‌తో యుద్ధం వస్తే మనం ఉత్తర భారతం, దక్షిణ భారతం అని చూసుకోమని దూబే వ్యాఖ్యానించారు. మనమందరం భారతీయులుగానే నిలబడతామని,

(మిగతా 2వ పేజీలో..)

## విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదం... రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన ప్రధాని మోదీ

- విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంపై ప్రధాని మోదీ తీవ్ర విచారం
- మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటన
- గాయపడిన వారికి రూ. 50 వేల ఆర్థిక సహాయం
- ప్రధాని జాతీయ సహాయ నిధి నుంచి పరిహారం చెల్లింపు
- బాధితులకు స్థానిక అధికారులు అన్ని విధాలా సాయం చేస్తున్నారని వెల్లడి

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో జరిగిన దురదృష్టకర ప్రమాదంపై ప్రధానమంత్రి (మిగతా 2వ పేజీలో..)



## తెలంగాణలోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు.. పలు జిల్లాలకు వర్ష సూచన

- తెలంగాణ రాష్ట్రంలోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు
- నారాయణపేట, జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాల మీదుగా ఆగమనం
- జూన్ 11-12 తేదీల్లో హైదరాబాద్‌ను తాకనున్న రుతుపవనాలు

(మిగతా 2వ పేజీలో..)



## రేవంత్ రెడ్డిని హిట్లర్, తాలిబాన్లతో పోల్చిన కవిత

- విద్యా వ్యవస్థను రేవంత్ రెడ్డి అస్తవ్యస్తం చేస్తున్నారన్న కవిత
- ప్రభుత్వ పాఠశాలలను 4 వేలకు తగ్గించాలని ప్రభుత్వం యోచిస్తోందని విమర్శ
- రూ. 11 వేల కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు పెండింగ్ లో ఉన్నాయని మండిపాటు

తెలంగాణలో విద్యా వ్యవస్థ తీరుపై కాంగ్రెస్ ప్రభుత్వం, (మిగతా 2వ పేజీలో..)



## 'ఇండీ' కూటమి సమావేశానికి టీవీకేకు అందని ఆహ్వానం..!

- ఢిల్లీలో ప్రతిపక్ష 'ఇండీ' కూటమి భేటీ
- హాజరుకానున్న ప్రధాన ప్రతిపక్ష పార్టీలు
- ఎంపీలు ఉన్న పార్టీలనే ఆహ్వానించినట్లు కాంగ్రెస్ వివరణ
- ఒక్క ఎంపీలేని టీవీకేకు అందుకే ఆహ్వానం అందలేదని సమాచారం

ఢిల్లీలో నేడు ప్రతిపక్ష 'ఇండీ' కూటమి భేటీ కానుంది. దీనికి తమిళనాడులో ఇటీవలే అధికారంలోకి వచ్చిన విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) హాజరవడంపై ఇప్పటికీ స్పష్టత లేదు.

(మిగతా 2వ పేజీలో..)



మన దునియా
RNI Number
మన అక్షరం - మన ప్రపంచం

## విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదం... రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన ప్రధాని మోదీ

(మొదటి పేజీ తరువాయి)

నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటన తనను ఎంతో బాధించిందని పేర్కొన్నారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ మేరకు స్పందించిన ప్రధాని మోదీ, మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి (పీఎంఎన్ఆర్ఎఫ్) నుంచి రూ. 2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. అదేవిధంగా, ఈ ప్రమాదంలో గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని వెల్లడించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.బాధిత కుటుంబాలకు స్థానిక అధికారులు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నారని ప్రధాని తన సందేశంలో పేర్కొన్నారు. ఈ కష్టకాలంలో బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఇవాళ సాయంత్రం విశాఖ స్టీల్ ప్లాంట్ వేడి ఉక్కు ద్రవం ఉన్న ల్యాడిల్ విస్ఫోటనం చెందడంతో 9 మంది కార్మికులు మృతి చెందడం తెలిసిందే.

## రేవంత్ రెడ్డిని హిట్లర్, తాలిబాన్లతో పోల్చిన కవిత

(మొదటి పేజీ తరువాయి)

సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యంగా తెలంగాణ రక్షణ సమితి కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను అస్తవ్యస్తం చేస్తున్నారంటూ సోషల్ మీడియా వేదికగా విడుదల చేసిన ఒక వీడియో సందేశంలో సీఎం రేవంత్ రెడ్డిని ఆమె హిట్లర్, తాలిబాన్లతో పోల్చారు.రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేలకు తగ్గించాలని ప్రభుత్వం యోచిస్తోందన్న ముఖ్యమంత్రి ప్రకటనపై కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడం ద్వారా పేద విద్యార్థులను, ముఖ్యంగా బాలికలను చదువుకు దూరం చేయాలని రేవంత్ రెడ్డి చూస్తున్నారని ఆమె ఆరోపించారు. ఇది ఒక ముఖ్యమంత్రి మాట్లాడే మాట కాదని, ఒక నియంత ఆలోచన విధానమని దుయ్యబట్టారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను ఒక సర్కస్ లాగా మార్చేశారని విమర్శించారు.డిగ్రీ అడ్మిషన్లలో తీవ్ర గందరగోళం నెలకొందని, హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్, కమిషనరేట్ వేర్వేరు కోర్సులను సిఫార్సు చేస్తున్నాయని తెలిపారు. యూనివర్సిటీల అనుమతి లేని కోర్సుల్లో కూడా అడ్మిషన్లు సాగుతున్నాయని ఆరోపించారు. గురుకుల పాఠశాలల్లో దాదాపు 100 మందికి పైగా విద్యార్థులు మరణించినా, ముఖ్యమంత్రి కనీసం ఒక సమీక్షా సమావేశం కూడా నిర్వహించకపోవడం దారుణమన్నారు.ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం.7 వల్ల విద్యార్థులు నేరుగా ట్యూషన్ ఫీజులు చెల్లించాల్సి వస్తోందని.. మరోవైపు రూ. 11 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని మండిపడ్డారు. ప్రైవేట్ కాలేజీల దోపిడీని అరికట్టేందుకు జీవో నెం.7ను వెంటనే రద్దు చేయాలని, ఫీజు నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని కవిత డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ విద్యా వ్యతిరేక నిర్ణయాలను ప్రజలంతా ముక్తకంఠంతో వ్యతిరేకించాలని ఆమె పిలుపునిచ్చారు.

## దేశాన్ని విడదీయొద్దు.. రేవంత్ రెడ్డికి 'ఇండీ' మిత్రపక్షం హితవు!

(మొదటి పేజీ తరువాయి)



రేవంత్ రెడ్డి ఈ విషయాన్ని గ్రహించాలని హితవు పలికారు. రేవంత్ కాంగ్రెస్ సీనియర్ నేత అయినప్పటికీ కూటమి భాగస్వామ్య పక్షంగా దేశ సమగ్రత విషయంలో తాము రాజీపడేది లేదని స్పష్టం చేసింది. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం కాకూడదని ఆశిస్తున్నట్లు పేర్కొంది.ఇటీవల బెంగళూరులో జరిగిన ఓ మీడియా సమావేశంలో రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. దేశ ప్రధాని, రాష్ట్రపతి ఇద్దరూ ఉత్తర భారతక్‌కు చెందినవారేనని.. దక్షిణాదిని ప్రాతినిధ్యం వహించే బలం బీజేపీకి లేదని ఆరోపించారు. దక్షిణ భారతదేశ ప్రజలు ఈ దేశంలో 'రెండో శ్రేణి పౌరులుగా' బతకడానికి ఇష్టపడరని అనడం చర్చనీయాంశంగా మారింది.ం

# తెలంగాణలోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు.. పలు జిల్లాలకు వర్ష సూచన

తెలంగాణ రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు సోమవారం ప్రవేశించాయి. నారాయణపేట, జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాల మీదుగా ఇవి రాష్ట్రంలోకి ప్రవేశించినట్లు భారత వాతావరణ శాఖ అధికారికంగా ప్రకటించింది. దీంతో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న వేసవి తాపం నుంచి ప్రజలకు ఉపశమనం లభించనుంది.ఈ నెల 4వ తేదీన కేరళను తాకిన రుతుపవనాలు క్రమంగా కదులుతూ కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలను దాటి తెలంగాణలోకి ప్రవేశించాయి. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో రానున్న రెండు, మూడు రోజుల్లో తెలంగాణలోని మరిన్ని ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోని ఇతర ప్రాంతాలకు ఇవి విస్తరిస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనాల ప్రకారం, జూన్ 11-12 తేదీల మధ్య రుతుపవనాలు గ్రేటర్ హైదరాబాద్ ప్రాంతాన్ని తాకే అవకాశం ఉంది. జూన్ 15 నుంచి 18వ తేదీలోగా రాష్ట్రంలోని మధ్య, ఉత్తర తెలంగాణ జిల్లాలకు ఇవి పూర్తిగా విస్తరిస్తాయని భావిస్తున్నారు.మరోవైపు, రుతుపవనాల రాకతో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. జూన్ 8, 9 తేదీల్లో వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీయడంతో పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడొచ్చని సూచించింది. రుతుపవనాల ఆగమనంతో రైతులు ఖరీఫ్ సాగు పనులకు సిద్ధమవుతున్నారు.

# 'ఇండీ' కూటమి సమావేశానికి టీవీకేకు అందని ఆహ్వానం..!

(మొదటి పేజీ తరువాయి)

అయితే ఈ సమావేశానికి ఆ పార్టీకి ఇంకా ఆహ్వానం పంపలేదని సమాచారం. దీనిపై కూటమి నేతలు ఈరోజు సాయంత్రంలోగా తుది నిర్ణయానికి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. తమిళనాడులో విజయ్ నేతృత్వంలోని 'టీవీకే' పార్టీకి కాంగ్రెస్ ప్రధాన మిత్రపక్షంగా ఉంది. అయినప్పటికీ ఈ సమావేశానికి విజయ్ పార్టీని పిలవకపోవడంపై కాంగ్రెస్ వర్గాలు స్పష్టత ఇచ్చాయి. కేవలం పార్లమెంట్ సభ్యులున్న రాజకీయ పార్టీలను మాత్రమే ఆహ్వానించామని కాంగ్రెస్ స్పష్టం చేసింది. ప్రస్తుతం 'టీవీకే'కు ఎలాంటి ఎంపీల ప్రాతినిధ్యం లేదు. అందుకే ఆ పార్టీకి ఇంకా ఆహ్వానం పంపలేదని కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.నిజానికి తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత విజయ్ తమ కూటమిని బలోపేతం చేయడానికి కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో తమకు దక్కిన ఏకైక ఖాళీ రాజ్యసభ సీటును మిత్రపక్షమైన కాంగ్రెస్‌కే కేటాయించారు. ఇటీవల జరిగిన కొన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఓటముల తర్వాత.. ప్రతిపక్షాల వ్యూహాలను మార్చేందుకు ఈ 'ఇండీ' కూటమి అత్యవసరంగా సమావేశమవుతోంది.కూటమి ఐక్యతను చాటడానికి, అంతర్గత విభేదాలను పరిష్కరించుకోవడానికి జరుగుతున్న ఈ సదస్సుకు 23 ప్రతిపక్ష పార్టీల ప్రతినిధులు హాజరవుతారని సమాచారం. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేతో పాటు తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ, అభిషేక్ బెనర్జీ, సమాజ్ వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, రాష్ట్రీయ జనతా దళ్ నేత తేజస్వీ యాదవ్ వంటి బడా నేతలు ఈ భేటీలో పాల్గొని భవిష్యత్తు వ్యూహాలపై చర్చించనున్నారు.

# విశాఖ స్టీల్ ప్లాంటులో ఘోర ప్రమాదం.. హాట్ మెటల్ పడి ఎనిమిది మంది సజీవ దహనం

**హాట్ మెటల్ ల్యాడిల్స్ కిందపడి సజీవదహనం**

**స్టీల్ మెల్టింగ్ స్టేషన్-2లో చోటుచేసుకున్న ఘటన**

**పలువురికి తీవ్ర గాయాలు.. ఆసుపత్రికి తరలింపు**

**మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆందోళన**

విశాఖపట్నం స్టీల్ ప్లాంటులో సోమవారం ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఈ దుర్ఘటనలో ఎనిమిది మంది కార్మికులు సజీవ దహనం కాగా, మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. స్టీల్ మెల్టింగ్ స్టేషన్-2 విభాగంలో ఈ విషాదం ఘటన చోటుచేసుకుంది.స్టీల్ మెల్టింగ్ స్టేషన్-2లో కన్వేయర్ ద్వారా హాట్ మెటల్ (మరుగుతున్న ఉక్కు ద్రవం) ఉన్న ల్యాడిల్స్‌ను తరలిస్తుండగా అవి ఒక్కసారిగా కుప్పకూలాయి. దీంతో అత్యధిక ఉష్ణోగ్రత వద్ద ఉన్న ఉక్కు ద్రవం... కింద పనిచేస్తున్న కార్మికులపై పడింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు అక్కడికక్కడే మృతి చెందగా, సమీపంలో ఉన్న మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు.ప్రమాద సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది, ప్లాంటు అధికారులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చేందుకు శ్రమిస్తున్నారు. ఈ ఊహించని దుర్ఘటనతో స్టీల్ ప్లాంటులో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాదానికి గల ప్రాథమిక కారణాలపై అధికారులు విచారణ చేపట్టారు.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం
జూన్ । మంగళవారం । 9 । 2026



# అసమాన్యుడే... అతి సామాన్యుడై...





**గ్రామసభలో జనం మధ్య మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు..**

**వేదిక పైకి పిలిచినా వెళ్ళని లీడర్..**

**పార్టీలకు అతీతంగా ముందడుగు వేయాలని సూచన..**

**కలిసికట్టుగా సమస్యలు పరిష్కరించుకోవాలి**

**షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు..**

**తమరి రాక మాకెంతో సంతోషం సుమండి : సర్పంచ్ ప్రవీణ్..**

**ఆదర్శ రాజకీయాలకు వన్నెతెచ్చిన నరసింహులు అన్న: ఉప సర్పంచ్ అశోక్**

**లింగారెడ్డి గూడా గ్రామసభలో పెద్దల సమక్షంలో సమస్యల పరిష్కారం**

**మన దునియా,ఫరూక్ నగర్:జూన్ 08**

ఎమ్మెల్యేగా నియోజకవర్గం లోనే అత్యధిక మెజారిటీతో గెలిచాడు.. వివేకానంద సేవ సమితి ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేశాడు.. దళిత విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశాడు.. తెలంగాణ తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగాడు.. ఫరూక్ నగర్ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దాడు.. మొదటినుంచి ఒకే పార్టీలో కొనసాగుతూ ఆదర్శ నాయకుడిగా అడుగులు వేస్తున్నాడు.. ఇలాంటి అసామాన్యుడు ఒక సామాన్యుడిలా గ్రామసభకు హాజరయ్యాడు.. జనం మధ్యలో కూర్చొని జనం సమస్యలు ఒకవైపు, నాయకులు చెప్పే మాటలు ఒకవైపు విని తన వంతు సలహాలను వేదిక పైకి వెళ్లకుండా ప్రజల్లోంచే వినిపించాడు. అతనెవరో ఈపాటికి మీకు అర్థమయ్యే ఉంటుంది.. నిజమే ఆయన షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు. అన్ని పార్టీల ఎమ్మెల్యేలు సమానంగా గౌరవించే మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఫరూక్ నగర్ మండలం లింగారెడ్డి గూడా గ్రామంలో సర్పంచ్ ఎంసి ప్రవీణ్ కుమార్, ఉప సర్పంచ్ ఎర్రోళ్ల అశోక్ ఆధ్వర్యంలో జరుగుతున్న గ్రామ సభకు అకస్మాత్తుగా హాజరై అందరినీ ఆశ్చర్యానికి గురి చేశారు. అది చూసిన సర్పంచ్, ఉప సర్పంచ్లు గౌరవంగా ఆయనను వేదిక మీదికి ఆహ్వానించినప్పటికీ వినకుండా ప్రజల మధ్యనే కూర్చుని ప్రజలు చెప్పే సమస్యలను ఆసక్తిగా విన్నారు. ఈ సందర్భంగా రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ తదితర సమస్యలు వెలుగులోకి వచ్చాయి. అదేవిధంగా ఇటీవల పలు రోడ్డు ప్రమాదాలకు కారణం అవుతున్న లింగారెడ్డి కూడా బస్ స్టాప్ వద్ద ప్రమాద నివారణ చర్యల గురించి ప్రజలు కోరగా స్పందించిన ట్రాఫిక్ సీఐ శంకరయ్య అక్కడ బ్యారికేట్లు ఏర్పాటు చేసి, సీసీ కెమెరాలు కూడా పెట్టిస్తామని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే స్థాయిలో ఉన్న బక్కని నరసింహులు ఈ కార్యక్రమానికి హాజరై గ్రామసభ జరుగుతున్న విధానాన్ని తెలుసుకోవడం అందరిని ఆశ్చర్యానికి గురిచేసిన అంశం.

నాయకుడు తోటమాలిలా ఉండాలి..

మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు..

నాయకుడు అనేవాడు ఒక తోటమాలిలా ఉండి ప్రజలను నిరంతరం కాపాడుకోవాలని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు సూచించారు. వేదికపైకి ఆహ్వానించినప్పటికీ ఆయన వేదిక పైకి వెళ్లకుండా జనాల్లోంచే మాట్లాడారు. నాయకులు నిస్వార్థంగా పనిచేయాలని, రాజకీయాలకు అతీతంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో ఏ సమస్యలు వచ్చినా అందరూ కలిసికట్టుగా మాట్లాడుకొని పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. లింగారెడ్డిగూడెం గ్రామ విషయంలో తన సహకారం నాయకులకు ఎప్పుడు ఉంటుందని, పార్టీ ఏదైనా గ్రామం తనదిగా భావించి నాయకులకు పూర్తిస్థాయిలో సహకరిస్తానని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు.

ఇది సంతోష సమయం..

సర్పంచ్ ఎంసీ ప్రవీణ్..

30 సంవత్సరాల తర్వాత గ్రామంలో జరుగుతున్న గ్రామ సభకు మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు రావడం, తమ విలువైన సందేశాన్ని ప్రజలకు ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందని గ్రామ సర్పంచ్ ఎంసి ప్రవీణ్ అన్నారు. గ్రామానికి పెద్దగా, మాజీ శాసన సభ్యులుగా ఆయన అనుభవాన్ని రంగరించి ఆయన ఇచ్చే సలహాలు, సూచనలు తమకు ఎంతో విలువైనవని అన్నారు. ఆయన సూచనలను పాటిస్తూ గ్రామాన్ని అభివృద్ధి దిశగా ముందుకు నడిపిస్తామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

కార్యక్రమానికి వన్నె తెచ్చారు..

ఉపసర్పంచ్ ఎర్రోళ్ల అశోక్

మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు కార్యక్రమానికి రావడం పట్ల కార్యక్రమానికి ఒక వన్నె వచ్చిందని ఉపసర్పంచ్ అన్నారు. మొదటినుంచి గ్రామంలో పార్టీలకు అతీతంగా అందరితో కలిసి మెలిసి ఉంటూ గ్రామాన్ని ప్రశాంతంగా ముందుకు నడిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆదర్శంగా పాలనలో ముందుకు సాగుతామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. గ్రామాభివృద్ధి కోసం కలిసికట్టుగా ముందడుగు వేస్తామని అన్నారు. లింగారెడ్డి గూడ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎంసి ప్రవీణ్ కుమార్, ఉప సర్పంచ్ ఎర్రోళ్ల అశోక్, వార్డు సభ్యులు ఎండి మెహరాజ్, మాధవిలత ఆళ్లగడ్డ, గోదా లక్ష్మయ్య, ఎర్ర మమత, వట్టెల మల్లేష్, భీష్మ బాలమణి, కొనింటి సాయిరాం, రంగంపల్లి శశాంక్ పాల్గొన్నారు. గ్రామసభకు స్పెషల్ ఆఫీసర్గా ఏఈ ముజామిన్ హాజరుకాగా, ఏఈ అభినవ్, డీటీ బాలవర్ధన్, జీపీఓ రాము, పంచాయతీ కార్యదర్శి వై. రాధాకృష్ణ, అంగన్వాడీ టీచర్లు అమృత, కొనింటి మంజుల, ఏఎన్ఎం నిర్మల, ఆశా వర్కర్లు బక్కని సరళ, మద్దూరు శిరీష తదితరులు పాల్గొన్నారు.

# పిల్లనిచ్చిన అత్తతో అల్లుడి పెళ్లి..!

**కూతురిని వదిలి అత్తతో ప్రేమ -- కోర్టులో వివాహం, వైరల్ వీడియోతో కలకలం**

**మన దునియా,ఉత్తరప్రదేశ్/కాన్పూర్ దేహాత్, జూన్ 8**

ప్రేమకు వయసు, బంధుత్వాలు అడ్డుకావని చెప్పేలా ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ దేహాత్ జిల్లాలో ఓ విచిత్ర ఘటన వెలుగులోకి వచ్చింది. పిల్లనిచ్చిన సొంత అత్తగారినే ఓ అల్లుడు ప్రేమించి, చివరకు కోర్టులో వివాహం చేసుకున్న ఘటన ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.స్థానికంగా వెలుగుచూసిన సమాచారం ప్రకారం, కాన్పూర్ దేహాత్ జిల్లా అక్బర్‌పూర్ పరిధికి చెందిన ఓ వ్యక్తి తన భార్య ఇంటికి తరచూ రాకపోకలు సాగించే సమయంలో అత్తతో సన్నిహితంగా మారినట్లు తెలుస్తోంది. కాలక్రమేణా ఆ పరిచయం ప్రేమగా మారిందని, ఇద్దరూ పరస్పర అంగీకారంతో ఇళ్లను విడిచి వెళ్లి కోర్టు వివాహం చేసుకున్నారని ప్రచారం జరుగుతోంది.వారి మధ్య గణనీయమైన వయసు వ్యత్యాసం ఉన్నప్పటికీ, "లోకం ఏమనుకున్నా తమ నిర్ణయంపై ఎలాంటి పశ్చాత్తాపం లేదని" చెప్పినట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న వీడియోల్లో కనిపిస్తోంది. కోర్టు వివాహ ధృవీకరణ పత్రాన్ని చేతిలో పట్టుకుని, తమ పెళ్లిని సమాజం అంగీకరించాలని, ఆశీర్వదించాలని కోరుతూ వీడియో విడుదల చేసినట్లు తెలుస్తోంది.అయితే ఈ ఘటనపై స్థానిక అధికారుల నుంచి లేదా పోలీసుల నుంచి అధికారిక ప్రకటన వెలువడినట్లు స్పష్టమైన సమాచారం ఇంకా అందుబాటులోకి రాలేదు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోల ఆధారంగా ఈ వార్త విస్తృత చర్చకు దారితీసింది. కొందరు దీన్ని వ్యక్తిగత స్వేచ్ఛగా చూస్తుండగా, మరికొందరు కుటుంబ విలువలు, బంధుత్వ వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. చట్టపరంగా ఇద్దరూ మేజర్లు అయి పరస్పర అంగీకారంతో వివాహం చేసుకుంటే వివాహానికి అవకాశం ఉన్నప్పటికీ, కుటుంబ సంబంధాల పరంగా ఈ ఘటన పెద్ద ఎత్తున చర్చనీయాంశంగా మారింది.గమనిక: ఈ ఘటనకు సంబంధించిన సమాచారం ప్రధానంగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలు, స్థానిక ప్రచారాల ఆధారంగా వెలుగులోకి వచ్చింది. అధికారిక నిర్ధారణ కోసం స్థానిక పరిపాలన లేదా పోలీసు వర్గాల ప్రకటన కోసం వేచి చూడాల్సి ఉంది.




## గడువుతీరిన పురుగుల మందులు అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

**సంగెం జూన్ 08మన దునియా**




మండలంలోని పోలీస్ స్టేషన్- సంగెం పల్లారుగూడా గ్రామంలోని మహేశ్వర ఏజెన్సీస్ నిర్వహిస్తున్న వేములపల్లి హరీష్ 49 తండ్రి వెంకటేశ్వర్లు గడువు తీరిన పురుగు మందుల విక్రయాలు జరుగుతున్నట్లుగా పక్క సమాచారం మేరకు ఆదివారం మండల వ్యవసాయ శాఖ అధికారి జగదీశ్వర్ తో కలిసి ఎస్సై వంశీకృష్ణ తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో లక్ష 38. వేల 904 రూ. విలువగల గడువుతీరిన పురుగు మందులను రైతులకు అమ్మాలనే ఉద్దేశంతో నిలువ చేయడం జరిగింది. పురుగు మందులను స్వాధీనం చేసుకోవడంతో పాటు షాప్ యజమానిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వంశీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గడువు తీరిన కల్తీ పురుగుమందులను విక్రయించడం చట్టరీత్యా నేరం, ఇలాంటి మందులు వాడటం వల్ల పంటలకు తీవ్ర నష్టం జరగడమే కాకుండా, రైతులు ఆర్థికంగా నష్టపోతారు. వ్యవసాయ శాఖ అధికారులు, పోలీసులు తరచుగా దాడులు చేసి, గడువు తీరిన పురుగుమందులను పట్టుకుంటామన్నారు. అనంతరం వ్యవసాయ అధికారి జగదీశ్వర్ మాట్లాడుతూ పురుగుమందుల ఎరువులు దుకాణాల దారులు రైతులకు కాలం చెల్లిన మందులు విక్రయిస్తే ఆ దుకాణం లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

## పెద్దగంగారంలో నిరుపేద కుటుంబం అయినా ఆలం సురేష్ ఆకస్మిక మరణించడం జరిగింది వారి కుటుంబాని పరామర్శించి దశదినకర్మలకు వారికి 50 కేజీల రైస్ బ్యాగులు అందించిన ఇర్పకేశవరావు( హెచ్ ఎం )

**మన దునియా వాజేడు జూన్ 8**



ములుగు జిల్లా వాజేడు మండలం కృష్ణాపురం గ్రామపంచాయతీ లోని పెద్ద గంగారం గ్రామంలో నిరుపేద కుటుంబం అయినా ఆలం సత్యం కుమారుడైన ఆలం సురేష్ అకస్మాత్తుగా మరణించడం జరిగింది అదే గ్రామానికి చెందిన ఇర్పప కేశవరావు హెచ్ఎం(ఎఫ్ ఏ సి ఏజిహెచ్ఎస్) పెద్ద గొల్లగూడెం అనువారు వారికి 50 కేజీల రైస్ బ్యాగ్స్ అందజేయడం జరిగింది నిరుపేద కుటుంబం అయిన వారి తల్లి మరియు అన్నయ్యకు ఈ బ్యాగ్స్ ను అందించడం జరిగింది వారితోపాటు పెద్ద గంగారం, గ్రామ పెద్దలు ఆలం సత్యనారాయణ, మరియు అలంనాగేశ్వరావు ,ఆలం పెద్ద సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు

## గ్రామ ప్రగతికి ప్రతి ఒక్కరూ సహకరించాలి: పొనకల్ గ్రామసభలో సర్పంచ్ పిలుపు

**రోడ్డు భద్రత, శాంతిభద్రతలపై అవగాహన కల్పించిన ఎస్సై ఉదయ్ కిరణ్**

**ఖానాపూర్ ఆర్సి మన దునియా: జన్నారం, జూన్;08.**

మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని పొనకల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రామసభలో గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమం, మౌలిక వసతుల మెరుగుదలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ మాట్లాడుతూ గ్రామంలోని అన్ని వార్డుల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా గ్రామసభలో పలు కీలక అంశాలపై చర్చ జరిగింది. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుధ్య నిర్వహణ, మురుగు కాలువల పూడికతీత, రహదారుల పక్కన ఉన్న ముళ్లపొదల తొలగింపు, వీధి దీపాల నిర్వహణ, తాగునీటి సరఫరా మెరుగుదల, హరితహారంలో భాగంగా మొక్కల పెంపకం వంటి అంశాలపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు.అలాగే వ్యవసాయ రంగంలో పంటల వైవిధ్యీకరణ ప్రాధాన్యత, ఓటర్ లిస్ట్ రివిజన్ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాభివృద్ధి కోసం గ్రామస్థులు పంచాయతీ పన్నులను సకాలంలో చెల్లించి సహకరించాలని సర్పంచ్ కోరారు.ఈ సందర్భంగా జన్నారం ఎస్సై ఉదయ్ కిరణ్ యువతను ఉద్దేశించి రోడ్డు భద్రత, శాంతిభద్రతలపై అవగాహన కల్పించారు. యువత గంజాయి వంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, రాత్రివేళల్లో అనవసర సంచారాన్ని నివారించాలని సూచించారు. మైనర్ బాలురకు వాహనాలు ఇవ్వకూడదని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణకు తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి (ఈవో) రాహుల్, మండల విద్యాధికారి విజయ్ కుమార్, ఉప సర్పంచ్ అప్పాల జలపతి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, అధికారులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

## 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ముగింపు గ్రామ సభలో

- గుమ్మడిదొడ్డి గ్రామపంచాయతీ సెక్రెటరీ స్వప్న మరియు గ్రామపంచాయతీ సిబ్బందికి ఘనంగా సన్మానించిన సర్పంచ్ భరత్ కుమార్ స్పెషల్ ఆఫీసర్ ఎమ్మార్వో శ్రీనివాస్ మరియు ఆర్ ఐ

**మన దునియా, వాజేడు, జూన్ 8**



ములుగు జిల్లా వాజేడు మండలం గుమ్మడిదొడ్డి గ్రామపంచాయతీలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ముగింపు గ్రామసభ ఈరోజు గుమ్మడిదొడ్డి గ్రామపంచాయతీ లో పెట్టడం జరిగింది మరియు సర్పంచ్ శుభోదయం అనే అబ్బాయి కుమార్ ఉపసర్పంచ్ బండారి రాజశ్రీ సెక్రెటరీ స్వప్న మరియు స్పెషల్ ఆఫీసర్ తహసిల్దార్ మరియు వార్డ్ కలకు సంబంధించిన అధికారులు గ్రామస్తులు మహిళలు ప్రజాప్రతినిధులు మరియు యూత్ పాల్గొనడం జరిగింది. 99 రోజుల ప్రగతి ప్రణాళిక ప్రజా పాలన భాగంగా ముగింపు గ్రామసభ సందర్భంగా గ్రామపంచాయతీ సిబ్బందికి సెక్రెటరీ స్వప్న కి సర్పంచ్ మరియు తహసిల్దార్ ఆర్ఐ చేతుల మీదుగా ఘనంగా సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు ఆల్ డిపార్ట్మెంట్ కి సంబంధించిన అధికారులు పాల్గొనడం జరిగింది

## కేశంపేటలో అక్రమ బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలి

**గ్రామస్తుల డిమాండ్**

**ఎస్సై రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేత**

**మన దునియా,కేశంపేట:జూన్ 08**




కేశంపేట మండల కేంద్రంలో గల్లీకి ఒక బెల్ట్ షాపు ఉన్నట్లు ఆరోపిస్తూ, వాటి కారణంగా గ్రామంలో సామాజిక సమస్యలు పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. తెల్లవారుజామునే మద్యం సేవించే వారి సంఖ్య పెరగడంతో అనేక కుటుంబాలు ఆర్థిక, సామాజిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. అనుమతులు లేకుండా విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, అక్రమ బెల్ట్ షాపులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని సోమవారం కేశంపేట ఎస్సై రాజ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బైరమోని బాలరాజ్, బొజ్జం శ్రీశైలం, గంజాయి దశరథం, తలసాని పవన్ కుమార్ రెడ్డి, పోలేమని సతీష్, బైకని శేఖర్, రాజు, రాజేందర్ రెడ్డి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు..

## బదిలీపై వెళ్తున్న ఏఈఓ సయ్యద్ అక్రముల్లా ఖాన్‌కు ఘన సన్మానం

**ఖానాపూర్ ఆర్సి మన దునియా, జూన్;08.**

మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని కవ్వాల్ (దేవునిగూడ) గ్రామంలో విధులు నిర్వహిస్తూ సింగరాయిపేట (తిమ్మాపూర్)కు బదిలీపై వెళ్తున్న వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) సయ్యద్ అక్రముల్లా ఖాన్ కి సోమవారం కవ్వాల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కవ్వాల్ సర్పంచ్ సక్రూ నాయక్ మరియు మండల యూత్ కాంగ్రెస్ నాయకులు షాకీర్ అలీ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, అక్రముల్లా ఖాన్ తన విధి నిర్వహణలో రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వ్యవసాయ శాఖ కార్యక్రమాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంలో విశేష కృషి చేశారని కొనియాడారు. పంటల మార్పిడి విధానం, ఆయిల్ పామ్ సాగు ప్రోత్సాహం, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తూ వారి అభ్యున్నతికి నిరంతరం పాటుపడ్డారని పేర్కొన్నారు.గత తొమ్మిది సంవత్సరాలుగా కవ్వాల్ పరిధిలోని రైతులకు సేవలందించిన అక్రముల్లా ఖాన్ రైతుల సందేహాలను నివృత్తి చేయడంలో, సలహాలు సూచనలు అందించడంలో విశేష పాత్ర పోషించారని తెలిపారు. రైతులతో ఆత్మీయ అనుబంధం ఏర్పరచుకున్న ఇటువంటి అధికారి బదిలీ కావడం బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం అక్రముల్లా ఖాన్‌ను శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేసి, ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి విశ్వక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తిరుపతి, వార్డు సభ్యులు శ్రీనివాస్, గుమ్ముల సత్తయ్య, అల్లటి రాజన్న, మహిమూద్ ఖాన్, సదా సింగ్, ఉల్లి పవన్, గ్రామ నాయకులు, పెద్దలు మరియు రైతులు తదితరులు పాల్గొన్నారు.



# మత్తులో జీవితం చిత్తు.. ఆలోచించి తల ఎత్తు ..

**మన దునియా,హైదరాబాద్:జూన్ 08**

ఒకప్పుడు ఇతర ఇతర ప్రాంతాలల్లో నగరాలలో పట్టణాలలో గంజాయి విక్రయాలు బానిసైన యువకుల ప్రచారం, వార్తలు వింటే ఆశ్చర్యాన్ని గురి అయ్యేవాళ్ళం కానీ నేడు పట్టణాల నుండి పల్లెలకు, గల్లీలకు గంజాయి విక్రయాలు చాప కింద నీరులా విస్తరిస్తున్నాయి. మనకు తెలియకుండానే మన ఊరులో, గల్లిలో మన పక్కన ఉన్నవాళ్ల మనకు తెలియకుండానే వాడికి ఆకర్షితులై బానిసలుగా మిగిలిపోతున్నారు.

ఇది ఆశ్చర్యాన్ని, ఆందోళనను కలిగిస్తున్నాయి.

స్కూళ్లు, కాలేజీల్లో చదువుకునే విద్యార్థులు, యువకులు గంజాయికి, ఇతర మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతున్న వార్తలు రోజు విస్త తంగా బయటకు వస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ శాఖ గంజాయి మాదకద్రవ్యాలపై ఉక్కు పాదం మోపుతున్న దాడులు చేస్తున్నా, రోజు ఏదో ఒక ప్రాంతంలో గంజాయి, మాదకద్రవ్యాలు, చాక్లెట్స్ రూపంలో, పట్టుబడటం చర్చనియంశంగా మారుతున్నది. ఇతర రాష్ట్రాల నుండి గంజాయిని కొనుగోలు చేస్తూ ఉమ్మడి నల్గొండ జిల్లాతోపాటు, తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థి, యువకులు, విక్రయిస్తూ పట్టుబడటం గంజాయికు బానిసలు కావటం, హత్యలు అత్యాచారాలు, ఘర్షణలకు, ఆత్మహత్యలకు పాల్పడటం సంచలనం కలిగిస్తున్నాయి. అనేక కుటుంబాల పిల్లలు వీటికి బలైపోయాయి బానిసలుగా తయారయ్యారు.

ప్రమాద అంచున ప్రయాణం సాగుతోంది. తమ పిల్లలను ఈ మహమ్మారి ఎక్కడ వెంటాడుతుందో అని తల్లిదండ్రులు ఆందోళన ఉన్నారు. తల్లిదండ్రులు అప్రమత్తమై. విద్యార్థి యువకుల కదలికలను పరిశీలిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే పిల్లల ఆరోగ్యం, భవిష్యత్తులకు పెద్దముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. ముఖ్యంగా తల్లిదండ్రులకు మాదక ద్రవ్యాల విషయంలో అవగాహన ఉండటం చాలా అవసరం. పిల్లలు తోటిపిల్లల ప్రభావానికి గురై దురలవాట్లకు, దుర్వ్యసనాలకుకు చేరువ అవుతుంటారు. మొదట వీటికి అలవాటు పడినవారు అక్కడితో ఆగకుండా ఆ మత్తులో ఎంతో ఆనందం ఉందంటూ తోటి పిల్లలకు చెబుతారు. దాంతో ఇతర పిల్లలు కూడా అదేదో కొత్తగా, ఆనందంగా ఉంటుందనే భావంతో, కుతూహలంతో ఈ అలవాటు వైపు మొగ్గుచూపే అవకాశం ఉంది. మద్యంతో వచ్చే మత్తుకంటే రెండింతలు ఎక్కువగా ఉంటుందని, అదో కొత్త కిక్కు అంటూ... అంతకుముందే అలవాటు న్నవారు కొత్తవారిని అటువైపు తీసుకెళ్తుంటారు. అందుకే పిల్లలు కొత్తవారితో స్నేహం చేస్తున్నా, ఇంట్లోంచి డబ్బు తీసుకుని వెళుతున్నా తల్లిదండ్రులు గమనించాలి. వారు డబ్బుని ఏం చేస్తున్నారో, ఎవరితో మాట్లాడుతున్నారో, ఎవరితో ఎక్కువ సమయం గడుపుతున్నారో, ఎక్కడ ఉంటున్నారో గమనించాలి. గంజాయికి అలవాటుపడిన వారు మిగతావారితో పోలిస్తే కాస్త ప్రత్యేకంగా కనిపిస్తారు. వారి ప్రవర్తన ఇంట్లో కూడా గుర్తించదగిన స్థాయిలో ఆ ప్రభావం ఉంటుంది. ఒంటరిగా ఉండడం, గంటల తరబడి గదిలోపలే ఉండడం, ఆలస్యంగా ఇంటికి రావడం, నిద్రపోవడం,ఆలస్యంగా లేవడం, మాట్లాడే మాటల్లో మార్పు, నేరుగా కళ్లలోకి చూడకుండా పక్కలకు చూస్తూ మాట్లాడడం లాంటివి పిల్లల్లో కనబడితే తల్లితండ్రులు వెంటనే అప్రమత్తం కావాలి.

తగిన జాగ్రత్తలు తీసుకొని కౌన్సిలింగ్ ద్వారా మార్పుకు ప్రయత్నించాలి. సాధారణంగా జీవితంలో ఏదైనా ఒత్తిడికి గురయినప్పుడు, ఒంటరి తనాన్ని ఫీలవుతున్నపుడు పిల్లలు మత్తుకి బానిసలయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. పరీక్షల్లో ప్రతికూల ఫలితాలు వచ్చినప్పుడు,ప్రేమలో విఫలమైనా,కుటుంబంలో ఏవైనా గొడవలు జరిగినప్పుడు యువతీయువకులు వీటివైపు మొగ్గుచూపే అవకాశం ఉన్నది.గంజాయిని వాడేవారి మిగతావారికి కంటే భిన్నంగా, ఉంటారు. మాట్లాడేటప్పుడు కాస్త తడబాటు, మనషిలో మార్పుగా ఉంటారు.ఫ్రెండ్షిప్‌లో..గొడవలకు ప్రాధాన్యతిస్తుంటారు గతంతో



పోలిస్తే పాకెట్ మనీ ఎక్కువ కావాలంటూ తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తుంటారు. సమాజంలో చెడు వ్యసనాలను ప్రోత్సహించే ధోరణి పెరుగుతున్నది. మద్యం సేవించడం అలవాటు లేనివారిని చిన్నచూపు చూసే విధంగా సమాజం మారుతున్నదిచెడు అలవాట్లను ఫ్యాషన్‌గా, ఆధునికతగా భావిస్తున్నారు. పిల్లల నడవడిక,వారి అలవాట్లు, స్నేహాలు,చదువు మొదలైన వాటిని దగ్గరుండి పర్యవేక్షించే బాధ్యత తల్లిదండ్రులదే. అయితే నేటి తల్లిదండ్రులకు పిల్లలతో గడిపే సమయం తగ్గిపోతున్నది.బాధ్యతలు పెరిగిపోయాయి. కూలినాలి చేసుకునే తల్లిదండ్రులు ఉదయాన్నే వెళ్లిపోయి రాత్రికి వస్తున్నారు. ఉద్యోగాలు చేసే వారు వ్యక్తిగత పనుల్లో బిజీగా ఉంటున్నారు. కొంతమంది చిన్నప్పుడు నుండి హాస్టళ్లకు పంపియటం, ప్రత్యేకంగా రూములో ఉంచడం, పట్టించుకోక పోవటంతో పిల్లలకు తల్లిదండ్రులకు దూరం పెరుగుతోంది. పిల్లల పట్ల అవగాహన లోపిస్తుంది.తల్లిదండ్రులు తప్పకుండా ఎన్ని ఇబ్బందులు ఉన్నా పిల్లలకోసం సమయం కేటాయించాలి. వారికి వ్యాయామం,ధ్యానం,క్రీడలు అలవాటు చేయాలి. మానవ సంబంధాలు,మానవీయ విలువలు, సమాజం పట్ల అవగాహన పెంచాలి. ధ్యానం చేసేవారికి మాదక ద్రవ్యాలు తీసుకున్నవారికంటే ఎక్కువ ఆనందం లభిస్తుంది. అలాగే ఇతరులకు మేలు చేయటం, పుస్తకాలు చదవటం,సంగీతం వినటం లాంటివి కూడా పిల్లల మనోబలాన్ని పెంచుతాయి. వారికి ఆసక్తి ఉన్న అభిరుచిలో వారిని ప్రోత్సహిం చినప్పుడు వారి ధ్యాస చెడు అలవాట్లవైపు మళ్లకుండా ఉంటుంది. పిల్లల్లో తాము విలువైన వ్యక్తులమనే భావాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంచాలి. వారికి జీవితంలో సాధించవలసిన లక్ష్యాలను నిర్దేశించి ప్రోత్సహించడం వలన బలమైన వ్యక్తిత్వం గలవారిగా మారతారు. వ్యసనాలకు దూరంగా ఉంటారు. ప్రైమరీ ఎడ్యుకేషన్ నుండి ఐ ఆర్ ఎడ్యుకేషన్ వర్క్ మాదకద్రవ్యాలు, గంజాయి వాటి దుష్ఫలితాలు, చట్టాలపై మీద అవగాహన సదస్సులు నిర్వహించాలి. పట్టణాల నుండి పల్లెల వరకు తల్లిదండ్రులకు పిల్లల పట్ల ఎలా జాగ్రత్తలు తీసుకోవాలినే అవగాహనా సదస్సు నిర్వహించాలి. ప్రభుత్వం,పోలీస్, యాంటి డ్రగ్స్ అధికారులు,నిత్యం పర్యవేక్షణ ఉండాలి. ఉత్పత్తి, విక్రయాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. ఏది ఏమైన ఈ సమాజంలో అందరం భాగస్వాములం. గంజాయి రహిత సమాజంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలి దానికోసం అందరూ కలిసికట్టుగా పని చేద్దాం. మాదకద్రవ్యాలను మానిపిద్దాం. భావితరాలకు బాటలు వేద్దాం.వీరే కాదు కవులు,కళాకారులు సినీ ప్రముఖులు సినీ యాక్టర్లు క్రీడాకారులు...ఇలా అనేకమంది గంజాయి,డ్రగ్స్ ఆన్లైన్ బెట్టింగ్స్, మహమ్మారికి వ్యతిరేకంగా జరిగేపోరులో వారి వంతు పాత్ర భాగస్వాములు అవుతున్నారు. మనం కూడా కలిసి నడుస్తాం. కలిసి నడుం బిగిద్దాం ఈ మహమ్మారికి వ్యతిరేకంగా జరిగే పోరులో భాగస్వాములు అవుతాం. వాటికి బానిసలుయిన అనేక కుటుంబాల యువతీ యువకులను విద్యార్థులను రక్షిద్దాం .గంజాయి డ్రగ్స్ బెట్టింగ్స్ రహిత సమాజం కోసం కృషి చేద్దాం..

## ఇసుక అక్రమ రవాణా నివారణకు ప్రత్యేక కమిటీ

**లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు**

**ప్రైవేటు హాస్పటల్లో ప్రత్యేక నీఘా పెట్టాలి**

**జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్**

**మన దునియా,మహబుబాద్: జూన్ 08**

జిల్లాలో అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ లబ్ధిదారులకు ప్రభుత్వం సూచించిన ప్రకారం ఇసుకను అందించాలని, ఇసుక రీచ్ లు కలిగిన ప్రదేశాలలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు, అందుకోసం జిల్లాస్థాయి ఇసుక టాస్క్ ఫోర్స్ కమిటీని నియమించడం జరిగిందని అందులో ఆర్డీవో, ఎడి మైనింగ్, పోలీస్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి, రవాణా శాఖ అధికారి, తదితరులు ఉంటారని ఈ యొక్క కమిటీ పూర్తిగా మన ఇసుక వాహనం పథకం అమలు, ఇసుకను అక్రమంగా తరలించకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు, ఉదయం పూట మాత్రమే ఇసుక రవాణా చేసే విధంగా ఏర్పాటు చేయాలని ప్రత్యేక పోస్టులు నియమించాలని పోలీస్ రెవెన్యూ అన్ని విభాగాలను ఆదేశించారు, అక్రమ స్కానింగ్లు, అబార్షన్లు జరగకుండా గట్టి నిఘాను ఏర్పాటు చేయాలని, మాతా, శిశు మరణాలను జరగకుండా చూడాలని, హాస్పటల్కు తనిఖీ వెళ్ళినప్పుడు తగిన నిబంధనలు పాటిస్తున్నారా లేదా సంబంధిత సీనియర్ వైద్యులు ఉన్నారా లేదా అనే విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు,

లింగ నిర్ధారణ, అక్రమ అబార్షన్లు లపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలి

లింగ నిర్ధారణ పరీక్షలు, అబార్షన్లు జరిగే ప్రాంతాలను గుర్తించి స్థానిక వైద్యుల చేత సమాచారం తెలుసుకొని, మెడికల్ షాపులలో మందుల అమ్మకాలను పరిశీలించాలని తెలిపారు, క్లినికల్ హాస్పిటల్ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి దరఖాస్తులు పకడ్బందీగా అన్ని విభాగాల వారు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఎలాంటి నిబంధనలు పాటించకుండా దరఖాస్తు చేస్తే తిరస్కరించాలని ఆదేశించారు, హాస్పటల్లో పనిచేసే వైద్యుల



వివరాలను తెలుసుకోవాలని, సూపర్ స్పెషాలిటీ, హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్స్, తదితర హాస్పిటల్స్ లో మౌలిక వసతులు ఫైర్, త్రాగునీరు ,పార్కింగ్, సిబ్బంది వివరాలు చెక్లిస్ట్ ప్రకారం తనిఖీ చేయాలని ఆదేశించారు, లింగ నిర్ధారణ, అక్రమ అబార్షన్లు, బాల్యవివాహాలు తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో ప్రజల్లో విస్తృతంగా ప్రచారం అవగాహన కల్పించాలని, నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అలా ప్రచారం నిర్వహిస్తే చాలా వరకు ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉంటాయని తెలిపారు,

ప్రైవేటు హాస్పటల్లో ప్రత్యేక నీఘా పెట్టాలి

జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రైవేటు హాస్పటల్లో ప్రత్యేక నీఘా పెట్టాలని, ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, క్షేత్రస్థాయిలో ప్రాథమిక వైద్యుల ద్వారా వివరాలు సేకరించాలని, తద్వారా లింగ నిర్ధారణ పరీక్షలను అరికట్టవచ్చని తెలిపారు, ప్రత్యేక విభాగం ద్వారా అక్రమ ఇసుక రవాణా, మందుల షాపులపై నిరంతర పర్యవేక్షణ, ప్రతి ప్రదేశంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలన్నారు, ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, తొర్రూరు ఆర్డీవో గణేష్, పోలీస్, తహసిల్దార్లు ఎడి మైనింగ్ వెంకటరమణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్, ఐఎంఐ, కోర్టు, సంబంధిత విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం
జూన్ । మంగళవారం । 9 । 2026



# వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలి

**జిల్లా కలెక్టర్‌కు టిడబ్ల్యూజేఎఫ్ వినతి**

**మన దునియా,మంచిర్యాల, జూన్ 8,**

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య ఆదేశాల మేరకు సోమవారం మంచిర్యాల జిల్లా కలెక్టర్‌కు వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు విద్యాసంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జర్నలిస్టు నాయకులు మాట్లాడుతూ సమాజానికి సమాచారాన్ని చేరవేయడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, వారి కుటుంబాలు అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా పెరుగుతున్న విద్యా ఖర్చుల నేపథ్యంలో జర్నలిస్టుల పిల్లల ఉన్నత విద్య భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం పలు పథకాలు అమలు చేస్తున్నప్పటికీ, వారి పిల్లల విద్యకు ప్రత్యేక రాయితీలు కల్పించడం ద్వారా మరింత భరోసా కలిగించవచ్చని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, వృత్తి విద్యా సంస్థల్లో ఫీజులు భారీగా పెరిగిన కారణంగా మధ్యతరగతి, తక్కువ ఆదాయం కలిగిన జర్నలిస్టు కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. జర్నలిస్టులు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తున్నారని, అలాంటి కుటుంబాలకు విద్యాపరమైన ప్రోత్సాహకాలు అందించడం సమాజం పట్ల ప్రభుత్వం చూపే గౌరవానికి నిదర్శనమని పేర్కొన్నారు. వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో కనీసం 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని, అలాగే ఉన్నత విద్య, సాంకేతిక విద్య, వృత్తి విద్యా కోర్సుల్లో ప్రత్యేక కోటా మరియు స్కాలర్‌షిప్‌లు అమలు చేయాలని కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల పిల్లల భవిష్యత్తు దృష్ట్యా ఈ



డిమాండ్‌ను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించాలని కోరారు. జర్నలిస్టులు ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో నిరంతరం సేవలందిస్తున్నారని, అలాంటి కుటుంబాలకు విద్యా రంగంలో రాయితీలు కల్పించడం ద్వారా వారి సేవలను ప్రభుత్వం గుర్తించినట్టవుతుందని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రత్యేక విద్యా సహాయ పథకాలు రూపొందించి అమలు చేయాలని కూడా కోరారు. ఈ సందర్భంగా సమర్పించిన వినతిపత్రాన్ని స్వీకరించిన జిల్లా కలెక్టర్ సమస్యను పరిశీలించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ చెన్నూర్ నియోజకవర్గ ఇంచార్జి మడ్డి వేణుగోపాల్ గౌడ్, దూడ సందీప్, వలస మణిరాజ్, ప్రవీణ్, సతీష్, రాజేష్, ప్రభాకర్, అమీన్, సుధీర్, రాజశేఖర్, జిల్లా, మండల నాయకులు, వర్కింగ్ జర్నలిస్టులు, పలువురు మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల్లో విద్యాసాగర్ జామి ప్రసాదరావుకు ఘన సన్మానం

**మన దునియా, జూన్ 8, మంచిర్యాల**

రాజమహేంద్రవరం వేదికగా జూన్ 6, 7 తేదీలలో జరిగిన 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల్లో మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన ప్రముఖ సాహితీవేత్త, సింగరేణి కాలరీస్ పాఠశాల కళ్యాణిఖని సీనియర్ హిందీ పండితులు విద్యాసాగర్ జామి ప్రసాదరావు జాతీయ సమన్వయకర్తగా పాల్గొని విశేష గుర్తింపు పొందారు. చైతన్య సారస్వత పరిషత్, శ్రీ శ్రీ కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహాసభలు దేశ విదేశాల నుంచి వచ్చిన సాహితీవేత్తలు, కవులు, రచయితలు, భాషాభిమానుల సమక్షంలో వైభవంగా సాగాయి. ఈ సందర్భంగా విద్యాసాగర్ జామి ప్రసాదరావు రచించిన విద్యా, సాహిత్య రంగాలకు సంబంధించిన పలు గ్రంథాలను సభా వేదికపై ఆవిష్కరించి విడుదల చేశారు. తెలుగు భాషా వికాసం, సాహిత్యాభివృద్ధికి ఆయన అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తించిన మహాసభల నిర్వాహకులు, ప్రముఖ సాహితీవేత్తలు ఆయనను శాలువా, మెమెంటో, ప్రశంసాపత్రంతో ఘనంగా సత్కరించారు. జాతీయ స్థాయి సాహిత్య వేదికపై




మందమర్రికి చెందిన సాహితీవేత్తకు ఈ గౌరవం లభించడం జిల్లా ప్రజలకు గర్వకారణంగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ జామి ప్రసాదరావుకు సాహితీవేత్తలు, విద్యావేత్తలు, స్నేహితులు, శ్రేయోభిలాషులు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల్లో ఆయన పోషించిన చురుకైన పాత్ర మందమర్రి పట్టణానికి ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చిందని కొనియాడారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించండి,సర్పంచ్ వాసాల శ్రీనివాస్





**కమలాపూర్, మన దునియా ప్రతినిధి**

భీంపల్లి గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రత్యేక బడిబాట కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ వాసాల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ప్రీ-ప్రైమరీ తరగతులు, అల్పాహారం, పౌష్టికాహారం, డిజిటల్ విద్య వంటి అనేక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని పిలుపునిచ్చారు. గ్రామ కార్యదర్శి లావణ్య, ప్రధానోపాధ్యాయులు తాటికొండ వీరస్వామి, రవి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మునిగే రాజు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## తెలంగాణలో 124 ఎంపీడీవో పోస్టులు ఖాళీ.. జిల్లాలవారీగా లిస్టు విడుదల చేసిన పంచాయతీరాజ్ శాఖ!




**మన దునియా,హైదరాబాద్:జాన్ 08**

రాష్ట్రవ్యాప్తంగా ఎంపీ డీవో పోస్టుల ఖాళీల వివరాలను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ శనివారం రిలీజ్ చేసింది. మల్టీజోన్--1,2 పరిధిలోని మొత్తం 124 ఎంపీడీవో పోస్టులు ఖాళీగా ఉన్నట్టు ప్రభుత్వం గుర్తించింది. ఈ మేరకు జిల్లాలు, మండలాలవారీగా ఖాళీల జాబితాను ఉన్నతాధికారులు విడుదల చేశారు. అత్యధికంగా నల్గొండలో 9, కామారెడ్డిలో 7. సిద్దిపేటలో 7, కుమ్రంభీం ఆసిఫాబాద్ 7, రంగారెడ్డి 6, నిర్మల్లోని 6 మండలాల్లో పోస్టులు ఖాళీలు ఉన్నాయి. మల్టీజోన్ --1లో ఆదిలాబాద్, భద్రా ద్రికొత్తగూడెం, హనుమకొండ, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, కరీం నగర్, ఖమ్మం, కుమ్రంభీం ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, మెదక్, ములుగు, నిర్మల్, నిజా మాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాలు ఉన్నాయి. మల్టీజోన్ -2లో జనగామ, మహబూబ్ నగర్, జోగులాంబ గద్వాల, నాగర్ కర్నూల్, నారాయణపేట, వనపర్తి, సంగారెడ్డి, రంగారెడ్డి, వికారాబాద్, నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలు ఉన్నాయి.

## ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారమే లక్ష్యం -- ప్రజాదివాస్‌లో జిల్లా ఎస్పీ



**మన దునియా,భూపాలపల్లి జిల్లా: జాన్ 08**

భూపాలపల్లి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ ప్రజాదివాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వచ్చిన పిర్యాదుదారుల నుండి మొత్తం 15 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు తక్షణ సూచనలు చేశారు. ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తూ, సంబంధిత పోలీస్ స్టేషన్ల సిఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి, సమస్యల పరిష్కారానికి అవసరమైన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ, ప్రజలు ఎలాంటి పైరవీలు లేకుండా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా, నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని, శాంతి భద్రతలను కాపాడుతూ ప్రజలకు మరింత చేరువగా ఉండడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి సోమవారం ప్రజాదివాస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, సంబంధిత అధికారుల సహకారంతో వాటిని పరిష్కరిస్తున్నామని, ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు.

## ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి

**రైతులు నష్టపోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి, భూపతి ప్రవీణ్**

**మన దునియా ప్రతినిధి, కమలాపూర్, జూన్ 8:**



ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేసి రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చూడాలని కమలాపూర్,బీజేపీ మండల నాయకుడు భూపతి ప్రవీణ్ కోరారు. రైతులకు అందుతున్న ఎరువుల సబ్సిడీలు, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి వంటి పథకాలు ఆగిపోకుండా ఉండేందుకు మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రతి గ్రామంలో ఏఈవోల ద్వారా రైతులకు అవగాహన కల్పించి, ఇంకా నమోదు చేసుకోని రైతులను గుర్తించి వెంటనే రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని సూచించారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్‌లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులు చొరవ తీసుకోవాలని, అర్హులైన ప్రతి రైతుకు ప్రభుత్వ పథకాల లబ్ధి అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా వ్యవసాయ శాఖ అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తికాక రైతులు నష్టపోతే సంబంధిత అధికారులదే బాధ్యత అవుతుందని భూపతి ప్రవీణ్ హెచ్చరించారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మన దునియా
RNI Number
మన అక్షరం - మన ప్రపంచం

## ప్రజాపాలన ప్రగతి కార్యక్రమంలో వార్డు సభ

**మన దునియా,హుజురాబాద్ నియోజకవర్గం జమ్మికుంట,**




జమ్మికుంట మున్సిపాలిటీ 18వ వార్డులో ప్రజాపాలన ప్రగతి కార్యక్రమంలో భాగంగా సోమవారం వార్డు సభ నిర్వహించారు. వర్షాకాల పారిశుద్ధ్యం, చెత్త నిర్వహణ, పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, తాగునీటి సమస్యలపై చర్చించారు. ప్రజలు తెలిపిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని కౌన్సిలర్ కూతాటి తిరుపతి తెలిపారు. కార్యక్రమంలో వార్డు అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## సెర్వైకల్ నొప్పితో బాధపడుతున్నారా?

ఈ డిజిటల్ యుగంలో చాలా మంది గంటల తరబడి కంప్యూటర్, ల్యాప్‌టాప్ లేదా మొబైల్‌పై పని చేస్తారు. దీని వల్ల మెడ, భుజాలపై ఒత్తిడి పెరుగుతుంది. ఈ కారణంగా చాలా మంది సెర్వైకల్ స్పాండిలైటిస్ లేదా మెడ నొప్పి సమస్యను ఎదుర్కొంటారు. ఈ డిజిటల్ యుగంలో చాలా మంది గంటల తరబడి కంప్యూటర్, ల్యాప్‌టాప్ లేదా మొబైల్‌పై పని చేస్తారు. దీని వల్ల మెడ, భుజాలపై ఒత్తిడి పెరుగుతుంది. ఈ కారణంగా చాలా మంది సెర్వైకల్ స్పాండిలైటిస్ లేదా మెడ నొప్పి సమస్యను ఎదుర్కొంటారు. మెడలో బిగుసుకుపోవడం, భుజాలలో ఒత్తిడి, తలనొప్పి, వీపు నొప్పి వంటివి సెర్వైకల్ లక్షణాలుగా ఉండవచ్చు. సెర్వైకల్ నొప్పిని తగ్గించడానికి మీరు కొన్ని వ్యాయామాల సహాయం తీసుకోవచ్చు. ఈ వ్యాయామం మెడ బిగుసుకుపోవడాన్ని తగ్గిస్తుంది. కండరాలను సడలిస్తుంది. ఈ వ్యాయామం చేయడానికి నిటారుగా కూర్చోండి లేదా నిలబడండి. ఆ తర్వాత మెడను నెమ్మదిగా ముందుకు వంచండి. ఆపై వెనుకకు వంచండి. ఈ ప్రక్రియను 5 నుండి 10 సార్లు చేయండి. దీని వల్ల సెర్వైకల్ నొప్పి తగ్గవచ్చు. ఇది మెడ సౌలభ్యాన్ని పెంచుతుంది. రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఈ వ్యాయామం చేయడానికి తలను నెమ్మదిగా కుడి వైపుకు తిప్పండి. కొన్ని సెకన్ల పాటు ఆపండి. ఆ తర్వాత తలను ఎడమ వైపుకు తిప్పండి. రెండు దిశలలో ఒక్కొక్కటి 5 సార్లు చేయండి. ఇది మెడ పక్కని కండరాలకు ఉపశమనం కలిగిస్తుంది. తలను నెమ్మదిగా కుడి వైపుకు వంచండి (చెవిని భుజం వైపు తీసుకురండి). 10 సెకన్ల పాటు ఆపండి. ఆపై ఎడమ వైపుకు పునరావృతం చేయండి. ఈ ప్రక్రియను 3-4 సార్లు చేయండి. ఈ భంగిమ మీ మెడ స్థానాన్ని మెరుగుపరుస్తుంది. సెర్వైకల్ నొప్పిని తగ్గిస్తుంది. దీన్ని చేయడానికి మీ వీపు, మెడను నిటారుగా ఉంచండి. ఆపై గడ్డాన్ని మెడ వైపు నెమ్మదిగా లోపలికి లాగండి. 5 సెకన్ల పాటు ఆపి, ఆ తర్వాత సాధారణ స్థితికి తిరిగి వెళ్లండి. దీన్ని 10 సార్లు పునరావృతం చేయండి.

## బీపీతో ఇబ్బందిపడుతున్నారా?

రక్తపోటు రోగులు తరచుగా బలహీనతను అనుభవిస్తారు. అలాంటి సమయాల్లో అరటిపండు శరీరానికి ఫ్రక్టోజ్, గ్లూకోజ్ వంటి సహజ చక్కెర ద్వారా శక్తిని అందిస్తుంది. అరటిపండు.. ప్రతి సీజన్‌లో ప్రతిచోటా సులభంగా లభించే పండు. ఇది ఒక సూపర్ ఫుడ్. వైద్యుల నుండి డైటీషియన్ల వరకు అందరూ రోజూ తినాలని సిఫార్సు చేస్తారు. ముఖ్యంగా బిపి రోగులకు ఇది ఒక దివ్యౌషధం లాంటిది. బీపీ రోగులు రోజూ ఒక అరటిపండు తినాలని వైద్యులు సలహా ఇస్తారు. వైద్యులు ఇచ్చిన ఈ చిన్న సలహా అధిక రక్తపోటు రోగుల జీవితాన్ని మార్చగలదు. అయితే బీపీ ఉన్నవారికి అరటిపండు ఎందుకు అంత ప్రత్యేకమైనదో? అరటిపండులో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఇది సోడియంను సమతుల్యం చేస్తుంది. రక్తపోటును సహజంగా నియంత్రిస్తుంది. అధిక బీపీకి పొటాషియం సహజ శత్రువు అని వైద్యులు అంటున్నారు. ఒక మధ్య తరహా అరటిపండులో దాదాపు 422ఎస్త్ర పొటాషియం ఉంటుంది. అమెరికన్ జర్నల్ ఆఫ్ ఫిజియాలజీ-రీనల్ ఫిజియాలజీలో ప్రచురితమైన ఒక కొత్త అధ్యయనంలో అధిక పొటాషియం తీసుకోవడం అనుకరణ కాలియురేసిస్, నాట్రియురేసిస్, బీపీని గణనీయంగా తగ్గిస్తుందని కనుగొంది. ఎక్కువ సోడియంతో కూడా ప్రయోజనాలను పొందవచ్చు. రక్తపోటు రోగులు తరచుగా బలహీనతను అనుభవిస్తారు. అలాంటి సమయాల్లో అరటిపండు శరీరానికి ఫ్రక్టోజ్, గ్లూకోజ్ వంటి సహజ చక్కెర ద్వారా శక్తిని అందిస్తుంది. అది కూడా ఎటువంటి దుష్ప్రభావాలు లేకుండా. అందుకే దీనిని సూపర్ ఫుడ్ అని పిలుస్తారు. బీపీ రోగులకు ఇది ప్రయోజనకరంగా ఉంటుంది. అరటిపండును ఒక పరిపూర్ణ ఆరోగ్య చిరుతిండిగా పరిగణిస్తారు. అరటిపండు రుచికరమైనది మాత్రమే కాదు తక్కువ కేలరీలు, అధిక పోషకాలు కలిగిన పండు కూడా. మీరు దీన్ని ఉదయం ఎప్పుడైనా తినవచ్చు. స్నాక్స్ సమయంలో లేదా నడక తర్వాత. దీనివల్ల శరీరానికి మంచి శక్తి, పోషకాలు లభిస్తాయి. అరటిపండ్లలో ఉండే విటమిన్ బి6, మెగ్నీషియం రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. ఒత్తిడిని తగ్గించడంలో కూడా సహాయపడతాయి. ప్రతిరోజూ ఒక అరటిపండు తినడం వల్ల మనసు కూడా రిలాక్స్‌గా ఉంటుంది. దీనివల్ల అనేక సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. అరటిపండులో ఉండే డైటరీ ఫైబర్ రక్తపోటును నియంత్రించడంలో సహాయపడటమే కాకుండా కొలెస్ట్రాల్‌ను సమతుల్యం చేస్తుంది. ఇది మీ గుండె ఆరోగ్యానికి బూస్టర్‌గా కూడా పనిచేస్తుంది.



# బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు, ఓటరు నమోదుపై సమన్వయ కమిటీ సమావేశం





**మన దునియా,హుజూరాబాద్, నియోజకవర్గం**

బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు, సర్ ఓటర్ నమోదు, అవగాహన కార్యక్రమాలపై హుజూరాబాద్‌లో సోమవారం సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి హాజరై పార్టీ నాయకులు, కార్యకర్తలకు పలు సూచనలు చేశారు.ఓటరు జాబితా ప్రక్రియలో బి ఎల్ ఏ,లు అప్రమత్తంగా వ్యవహరించి అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు నమోదు అయ్యేలా చూడాలని బోయినపల్లి వినోద్ కుమార్ సూచించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గ్రామ, బూత్ స్థాయికి విస్తరించి పార్టీని మరింత బలోపేతం చేయాలని పాడి కౌశిక్ రెడ్డి పిలుపునిచ్చారు.జూన్ 12న జమ్మికుంటలోని, ఎమ్ పి ఆర్,గార్డెన్‌లో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, బి ఎల్ ఏ,లు తప్పనిసరిగా హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


## అలాంటివారు ఈ పండు తినకండి!




జామ పండు.. పేదల ఆపిల్ గా పేరు దక్కించుకున్న జామ పండు అన్ని సీజన్లో విరివిగా లభిస్తుంది. దానిమ్మ పండ్లతో పోల్చుకుంటే ఖర్చు కూడా చాలా తక్కువ. చిన్న పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరు కూడా జామ పండును ఎంతో ఇష్టంగా తింటారు. జామపండు పోషకాలకు నిలయం అని చెప్పవచ్చు. ఇకపోతే జామ పండు తినడం వల్ల శరీరానికి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కూడా లభిస్తాయి.. అయితే కొంతమందికి జామపండు పడదు. కొంతమందికి సైడ్ ఎఫెక్ట్స్ కూడా వస్తాయి. ఇంకొంతమంది ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఇకపోతే ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నవారు జామ పండు తినకూడదో ఇప్పుడు చూద్దాం. జామ పండు చలికాలంలో తింటే బోలెడు ప్రయోజనాలు కలుగుతాయి. ఇందులో ఉండే విటమిన్ సి ఇమ్యూనిటీ పవర్ ను పెంచుతుంది. జామ పండు తినడం వల్ల రక్తపోటు తగ్గడంతో పాటు గుండె ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. జామ పండులో ఉండే విటమిన్ ఏ కంటి ఆరోగ్యాన్ని పెంచుతుంది. అలాగే శరీరానికి కావలసిన విటమిన్ డి కూడా లభిస్తుంది. ఇన్ని పోషకాలు ఉన్న జామ పండు కి కొంత మంది దూరంగా ఉండాలి.అలర్జీ సమస్యలతో బాధపడేవారు జామపండు తినకపోవడం మంచిది. అలాగే చర్మవ్యాధులు, శ్వాసకోశ వ్యాధులతో బాధ పడే వారు కూడా జామపండు తినకూడదు. జామ పండు తింటే చర్మం పై దద్దుర్లు, మంట, వాపు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి సమస్యలు ఉన్నవారు జామపండుకు దూరంగా ఉండటమే మేలు అని నిపుణులు చెబుతున్నారు. అలాగే గ్యాస్ట్రిక్, ఎసిడిటీ వంటి సమస్యలు ఉన్నవారు కూడా జామ పండుకు దూరంగా ఉండాలి. జామ పండు జీర్ణం అవ్వడానికి ఎక్కువ సమయం పడుతుంది కాబట్టి జీర్ణ సంబంధిత సమస్యలు ఉన్నవారు కూడా జామ పండుకు దూరంగా ఉండటమే మంచిది.

## పడుకునే ముందు వాము నీటిని తాగితే ఇన్ని లాభాలా?

వామును మెత్తటి పౌడర్‌గా చేసుకుని నిల్వ చేసుకోవాలి. పంటి నొప్పితో ఇబ్బంది పడుతున్నవారు.. అర టీ స్పూన్ వాము పౌడర్, కొద్దిగా ఆలివ్ ఆయిల్, గోరువెచ్చని నీటితో కలిపి తాగితే, పంటి నొప్పిని తగ్గిస్తుంది. అంతేకాదు..నోటి దుర్వాసన కూడా దూరమవుతుంది. గోరువెచ్చని నీటిలో వాము పౌడర్ కలిపి తాగడం వల్ల నెలసరి సమయంలో మహిళలు ఎదుర్కొనే తిమ్మిర్లు, కడుపు నొప్పిని దూరం చేస్తుంది. పొత్తి కడుపు తగ్గుతుంది. ఇలా క్రమంగా వాము వాటర్ తాగుతూ ఉంటే.. బరువు కూడా తగ్గుతారు. ఇందుకోసం వాము పొడి లేదంటే, వాముని నేరుగా కూడా తీసుకోవచ్చు. వాములో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. అందువల్ల శ్వాస కోస వ్యాధులు రాకుండా ఉంటాయి. ఒక వేళ జలుబు, దగ్గు, కఫం లాంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఈ నీటిని తాగడం వల్ల అవి తగ్గుముఖం పడతాయి. రాత్రి పడుకునే ముందు ఇలా గోరువెచ్చని నీటిలో వాము పౌడర్‌ని కలిపి తాగడం వల్ల జీర్ణ సమస్యలు దూరమవుతాయి. సాధారణంగా కడుపు ఉబ్బరం, త్రేన్పులు, జీర్ణ సమస్యల్ని దూరం చేయడంలో ఈ వాము వాటర్ బాగా హెల్ప్ చేస్తాయి. వాముని కప్పున్నర నీటిలో వేసి మరిగించి కప్పు అయ్యే వరకూ ఉంచాలి. దీనిని ఫిల్టర్ చేసి రెగ్యులర్‌గా తీసుకుంటే బరువు తగ్గుతారు. పిల్లలకు అరుగుదల సరిగ్గా లేకపోయినా, పెద్దలు గ్యాస్ లాంటి వాటితో బాధ పడుతున్నా వాము ఔషధంగా పనిచేస్తుంది. వాముతో జీర్ణ సంబంధిత సమస్యలను దూరం చేస్తుంది.



# మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే



శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయి పెరిగినప్పుడు అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. ఈ సమస్యలు ముఖ్యంగా ఆర్థరైటిస్, కిడ్నీ సంబంధిత వ్యాధుల రూపంలో కనిపిస్తాయి. అధిక యూరిక్ యాసిడ్ కారణంగా జాయింట్లలో నొప్పులు, వాపులు మొదలవుతాయి. గ్రీన్ కలర్ ఫుడ్స్ దినచర్యలో భాగం చేస్తే ఈ సమస్యను సహజంగా నివారించవచ్చు. పాలకూరలో శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇందులో ఉన్న మెగ్నీషియం శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. పాలకూరను రోజూ తీసుకోవడం వల్ల శరీరానికి పుష్కలమైన పోషకాలు అందించడమే కాక.. ఆరోగ్యాన్ని కాపాడేందుకు సహాయపడుతుంది.పచ్చి బఠానీలలో ఫైబర్ అధికంగా ఉంటుంది.. ఇది శరీరానికి కావలసిన శక్తిని అందిస్తుంది. వీటిలో ఉన్న యాంటీఆక్సిడెంట్లు శరీరాన్ని డిటాక్స్ చేయడంలో తోడ్పడతాయి. గౌట్ వంటి సమస్యలను తగ్గించడానికి ఈ బీన్స్ చాలా ఉపయోగపడతాయి.గ్రీన్ టీ శరీరంలోని హానికరమైన వ్యర్థాలను బయటకు పంపడంలో సహాయపడుతుంది. ఈ టీలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఆహ్లాదకరమైన రుచి యూరిక్ యాసిడ్ స్థాయిలను తగ్గించడంలో తోడ్పడతాయి. ప్రతిరోజూ ఒక కప్పు గ్రీన్ టీ తాగడం వల్ల మంచి ఫలితాలు పొందవచ్చు. సెలరీలో ఉన్న పోషకాలు మూత్రపిండాల పనితీరును మెరుగుపరుస్తాయి. ఇది శరీరంలోని వాపును తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ఈ ఆకుకూర సహాయపడుతుంది. అవకాడోలో ఆరోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉంటాయి. ఈ పండు శరీరానికి అవసరమైన ఎనర్జీ అందించే ప్రక్రియను మెరుగుపరుస్తుంది. ఇది శరీరంలోని వ్యర్థ పదార్థాలను వెలుపలికి పంపడంలో సహాయపడుతుంది. యూరిక్ యాసిడ్ స్థాయిని తగ్గించడానికి అవకాడో ఉపయోగపడుతుంది. ఆస్పరాగస్‌లో ఫైబర్, ప్యూరిన్లు సమతుల్యంగా ఉంటాయి. ఇది శరీరంలోని హానికరమైన పదార్థాలను తగ్గించడంలో సహాయపడుతుంది. కాబట్టి ఆస్పరాగస్ ను తగిన మోతాదులో తీసుకోవడం మంచిది.గ్రీన్ బీన్స్ లో ప్యూరిన్లు తక్కువగా ఉంటాయి.. అందుకే ఇవి యూరిక్ యాసిడ్ స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి.

మన దునియా
RNI Number
మన అక్షరం - మన ప్రపంచం



# అరంగేట్రంలోనే మానవ్ సుతార్ మాయాజాలం... ఫాలో ఆన్‌లో ఆఫ్ఘనిస్థాన్



**టెస్టు అరంగేట్రంలోనే 6 వికెట్లు పడగొట్టిన లెఫ్టార్మ్ స్పిన్నర్ మానవ్ సుతార్**

**తొలి ఇన్నింగ్స్‌లో 152 పరుగులకే ఆలౌటైన ఆఫ్ఘనిస్థాన్**

**ఒంటరి పోరాటంతో 60 పరుగులు చేసిన రహ్మత్ షా**

**412 పరుగుల భారీ ఆధిక్యంతో ఆఫ్ఘన్‌ను ఫాలో ఆన్ లోకి పంపిన భారత్**

మొహాలీలోని పీసీఏ స్టేడియం వేదికగా జరుగుతున్న ఏకైక టెస్టు మ్యాచ్‌లో అరంగేట్ర ఆటగాడు, లెఫ్టార్మ్ స్పిన్నర్ మానవ్ సుతార్ అద్భుత ప్రదర్శనతో అదరగొట్టాడు. తన స్పిన్ మాయాజాలంతో ఆరు వికెట్లు పడగొట్టి ఆఫ్ఘనిస్థాన్ పతనాన్ని శాసించాడు. మూడో రోజు లంచ్‌కు ముందే ఆఫ్ఘన్‌ను 152 పరుగులకే ఆలౌట్ చేసిన భారత్, ఆ జట్టును ఫాలో ఆన్ లోకి పంపింది. 564/8 పరుగుల వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసిన భారత్ స్కోరుకు 451 పరుగులు వెనుకబడి, 113/5 ఓవర్‌నైట్ స్కోరుతో సోమవారం మూడో రోజు ఆటను ఆఫ్ఘనిస్థాన్ ప్రారంభించింది. అయితే, ఆరంభంలోనే ప్రసిధ్ కృష్ణ దెబ్బకొట్టాడు. అజ్మతుల్లా ఒమర్జాయ్‌ను (0) బౌల్డ్ చేసి ఆఫ్ఘన్‌ను 118/6తో కష్టాల్లోకి నెట్టాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా మరో ఎండ్‌లో రహ్మత్ షా ఒంటరి పోరాటం చేశాడు. ఈ క్రమంలో భారత్‌పై టెస్టుల్లో హాఫ్ సెంచరీ నమోదు చేసిన తొలి ఆఫ్ఘన్ బ్యాటర్‌గా నిలిచాడు. గాయంతో బాధపడుతున్న షరాఫుద్దీన్ అష్రఫ్‌తో కలిసి ఏడో వికెట్‌కు 24 పరుగులు జోడించి భారత బౌలర్లను కాసేపు నిలువరించాడు. ఈ దశలో మళ్లీ బౌలింగ్‌కు వచ్చిన మానవ్ సుతార్, ఈ భాగస్వామ్యాన్ని విడదీశాడు. స్లాగ్ షాట్‌కు యత్నించిన అష్రఫ్‌ను రిషభ్ పంత్ క్యాచ్ పట్టగా, ఫీల్డ్ అంపైర్ నాటౌట్ ఇవ్వడంతో భారత్ రివ్యూకు వెళ్లి విజయం సాధించింది. ఆ తర్వాత సుతార్ తన మ్యాజిక్ మొదలుపెట్టాడు. అద్భుతంగా ఫ్లైట్ చేసిన బంతితో స్వీప్ షాట్ ఆడబోయిన రహ్మత్ షా (60)ను క్లీన్ బౌల్డ్ చేసి, తన అరంగేట్రంలోనే ఐదు వికెట్ల ఘనతను అందుకున్నాడు. అంతటితో ఆగకుండా మహ్మద్ సలీంను ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపి ఆరో వికెట్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. దీంతో టెస్టు అరంగేట్రంలో ఐదు వికెట్లు తీసిన 10వ భారత బౌలర్‌గా, ఏడో స్పిన్నర్‌గా రికార్డు సృష్టించాడు. ఆఖరి వికెట్‌ను వాషింగ్టన్ సుందర్ తీయడంతో ఆఫ్ఘన్ ఇన్నింగ్స్ 58.4 ఓవర్లలో 152 పరుగుల వద్ద ముగిసింది. ఆఫ్ఘనిస్థాన్ తన చివరి 5 వికెట్లను కేవలం 36 పరుగుల వ్యవధిలో కోల్పోయింది. భారత్ కు 412 పరుగుల భారీ ఆధిక్యం లభించడంతో ఆఫ్ఘన్ ఫాలో ఆన్ లో పడింది.

సంక్షిప్త స్కోర్లు:

భారత్ మొదటి ఇన్నింగ్స్: 564/8 డిక్లేర్డ్ (127 ఓవర్లు)

ఆఫ్ఘనిస్థాన్ మొదటి ఇన్నింగ్స్: 152/10 (58.4 ఓవర్లు) (రహ్మత్ షా 60; మానవ్ సుతార్ 6-33, ప్రసిధ్ కృష్ణ 3-37)

# టెస్టు క్రికెట్ చరిత్రలో టీమిండియాకు అతి పెద్ద విజయం.. ఆఫ్ఘన్‌పై రికార్డు గెలుపు



**ఆఫ్ఘనిస్థాన్‌పై ఇన్నింగ్స్ 300 పరుగులతో భారత్ చారిత్రక విజయం**

**టెస్టు క్రికెట్‌లో టీమిండియాకు ఇదే అతిపెద్ద గెలుపు**

**తొలి ఇన్నింగ్స్‌లో మానవ్ సుతార్, రెండో ఇన్నింగ్స్‌లో వాషింగ్టన్ సుందర్ మాయ**

**గిల్, కేఎల్ రాహుల్ సెంచరీలతో భారీ స్కోరు సాధించిన భారత్**

**కేవలం 112 పరుగులకే కుప్పకూలిన ఆఫ్ఘన్ రెండో ఇన్నింగ్స్**

ఏకైక టెస్టు మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్థాన్‌పై భారత్ చారిత్రక విజయం సాధించింది. ఇన్నింగ్స్, 300 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. టెస్టు క్రికెట్ చరిత్రలో టీమిండియాకు పరుగుల పరంగా ఇదే అతిపెద్ద విజయం కావడం విశేషం. భారత బౌలర్ల ధాటికి ఆఫ్ఘనిస్థాన్ రెండు ఇన్నింగ్స్‌లలోనూ చేతులెత్తేసింది. చండీగఢ్‌లోని ముల్లన్‌పూర్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (126), కేఎల్ రాహుల్ (100) సెంచరీలతో 8 వికెట్లకు 564 పరుగుల భారీ స్కోరు చేసింది. అనంతరం తొలి ఇన్నింగ్స్‌లో ఆఫ్ఘనిస్థాన్ కేవలం 152 పరుగులకే ఆలౌట్ అయింది. భారత యువ స్పిన్నర్ మానవ్ సుతార్ 6 వికెట్లతో సత్తా చాటడంతో ఆఫ్ఘన్ ఫాలో-ఆన్ ఆడాల్సి వచ్చింది. ఫాలో-ఆన్‌లో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆఫ్ఘనిస్థాన్, కేవలం 35.5 ఓవర్లలో 112 పరుగులకే కుప్పకూలింది. భారత స్పిన్నర్లు వాషింగ్టన్ సుందర్ (4 వికెట్లు), కుల్దీప్ యాదవ్ (3 వికెట్లు) ఆఫ్ఘన్ పతనాన్ని శాసించారు. వారికి పేసర్ మహమ్మద్ సిరాజ్ ఒక వికెట్‌తో సహకరించాడు. రెండో ఇన్నింగ్స్‌లో ఆఫ్ఘన్ ఓపెనర్లు తొలి వికెట్‌కు 42 పరుగులు జోడించి కాస్త ప్రతిఘటించినా, సిరాజ్ వికెట్ తీయడంతో వారి పతనం ప్రారంభమైంది. లంచ్ తర్వాత కేవలం 24 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పూర్తిగా ఓటమిని ఖాయం చేసుకుంది. గాయం కారణంగా ఆఫ్ఘన్ ఆటగాడు షరఫుద్దీన్ అష్రఫ్ బ్యాటింగ్‌కు రాలేదు.

# 15 ఏళ్లకే సంచలనం.. భారత జట్టులో చోటు.. కానీ అసలు ప్రశ్న అదే!: ఏబీ డీవిలియర్స్

**15 ఏళ్లకే భారత జట్టుకు ఎంపికైన వైభవ్ సూర్యవంశీ**

**వైభవ్‌ను అద్భుతమైన ప్రతిభావంతుడిగా అభివర్ణించిన డివిలియర్స్**

**అయితే అతను టెస్ట్ క్రికెట్ ఆడతాడనే నమ్మకం లేదని వ్యాఖ్య**

**యువ క్రికెటర్‌ను జట్టులోకి తీసుకోవడం సెలక్టర్ల సాహసోపేత నిర్ణయమన్న ఏబీడీ**


క్రికెట్ ప్రపంచంలో ఇప్పుడు ఎక్కడ చూసినా ఒకే ఒక్క పేరు మారుమోగిపోతోంది. అదే 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ. ఇటీవలే ముగిసిన ఐపీఎల్ సీజన్‌లో సంచలన ప్రదర్శనతో దాదాపు 776 పరుగులు సాధించి, టోర్నమెంట్ చరిత్రలోనే ఆరెంజ్ క్యాప్ గెలుచుకున్న అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు. ఈ అద్భుతమైన ఫామ్‌తో సెలక్టర్లను మెప్పించి, ఏకంగా భారత జాతీయ జట్టుకు పిలుపు అందుకున్నాడు. తద్వారా భారత పురుషుల క్రికెట్ జట్టుకు ఎంపికైన అత్యంత పిన్న వయస్కుడిగా చరిత్ర సృష్టించాడు. ఐపీఎల్‌కు ముందే వైభవ్ తన ప్రతిభను నిరూపించుకున్నాడు. ఏజ్-గ్రూప్ క్రికెట్, దేశవాళీ సర్క్యూట్‌తో పాటు అండర్-19 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులోనూ కీలక పాత్ర పోషించి రికార్డులు నెలకొల్పాడు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో తన సత్తా చాటినప్పటికీ, అసలైన టెస్ట్ క్రికెట్ (రెడ్-బాల్) ఆడటంపై అతనికి ఎంతవరకు ఆసక్తి ఉందనే చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలో దక్షిణాఫ్రికా క్రికెట్ దిగ్గజం, ఆల్-ఫార్మాట్ బ్యాటర్ ఏబీ డివిలియర్స్.. వైభవ్ భవిష్యత్తుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. వైభవ్‌ను 'అద్భుతమైన ప్రతిభావంతుడు' అని ప్రశంసించినప్పటికీ, అతని టెస్ట్ కెరీర్‌పై సందేహాలు వ్యక్తం చేశాడు. "అతను రెడ్-బాల్ క్రికెట్ ఆడగలడా? లేదా? అనే ప్రశ్నకు నేను సమాధానం చెప్పలేను. అతను ఆడాలనుకుంటే ఆడగలడు. కానీ, అసలు ప్రశ్న అదే.. అతనికి నిజంగా టెస్టులు ఆడాలనే కోరిక ఉందా? దానికి కాలమే సమాధానం చెబుతుంది. అతనిలో నైపుణ్యం, సామర్థ్యాలకు కొదవ లేదు. ఒకవేళ అతను టెస్ట్ క్రికెట్ ఆడాలని నిర్ణయించుకుంటే, కొన్ని సవాళ్లు ఎదురవుతాయి. వాటిని అధిగమించే సత్తా అతనిలో ఉంది. వ్యక్తిగతంగా అతను టెస్టులు ఆడాలని నేను కోరుకుంటున్నాను. కానీ, అతను ఆడతాడనే నమ్మకం నాకు లేదు. భవిష్యత్తులో ఏం జరుగుతుందో చూద్దాం" అని డివిలియర్స్ పేర్కొన్నాడు. అయితే, వైభవ్‌ను భారత జట్టులోకి తీసుకోవడం సరైన నిర్ణయమేనని డివిలియర్స్ స్పష్టం చేశాడు. "ఇది సెలక్టర్లు తీసుకున్న సరైన, సాహసోపేతమైన నిర్ణయం. అతను ఇంకా చిన్నవాడని చెప్పి పక్కన పెట్టడం సులువే. కానీ, అతను తన ప్రదర్శనతో ఆ తలుపులు బద్దలు కొట్టాడు. భారత టీ20 జట్టులో తన స్థానానికి పూర్తిగా అర్హుడు" అని ఏబీడీ ప్రశంసించాడు.






# ఫిఫా వరల్డ్ కప్‌లో వింత పరిస్థితి: అమెరికాకు వెళ్లకుండా మెక్సికోలో దిగిన ఇరాన్ జట్టు

2026 ఫిఫా వరల్డ్ కప్‌లో పాల్గొనేందుకు వచ్చిన ఇరాన్ జాతీయ ఫుట్‌బాల్ జట్టు, ఆతిథ్య దేశమైన అమెరికాలో అడుగుపెట్టకుండా సరిహద్దులోని మెక్సికో నగరమైన టిజువానాకు చేరుకుంది. అమెరికా, ఇరాన్ మధ్య కొనసాగుతున్న యుద్ధ వాతావరణం, వీసా నిబంధనల కారణంగా ఈ విచిత్ర పరిస్థితి ఏర్పడింది. ఈ పరిణామం క్రీడా ప్రపంచంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అమెరికా తమ పట్ల వివక్ష చూపుతోందని, ఉద్దేశపూర్వకంగానే అడ్డంకులు సృష్టిస్తోందని ఇరాన్ ఫుట్‌బాల్ ఫెడరేషన్ అధ్యక్షుడు మెహదీ తాజ్ తీవ్ర ఆరోపణలు చేశారు. జూన్ 15న లాస్ ఏంజిల్స్‌లో న్యూజిలాండ్‌తో జరగనున్న మొదటి మ్యాచ్‌కు కేవలం ఒక్కరోజు ముందు మాత్రమే తమ ఆటగాళ్లకు వీసాలు జారీ చేశారని ఆయన తెలిపారు. సహాయక సిబ్బంది, మీడియా ప్రతినిధులు చాలామందికి ఇంకా వీసాలు రాలేదని, దీనిపై ఫిఫాకు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. ఈ ఆరోపణలపై ఒక అమెరికా అధికారి స్పందించారు. ఇరాన్ ఆటగాళ్లు, అవసరమైన సిబ్బందికి వీసాలు మంజూరు చేశామని ధృవీకరించారు. అయితే, భద్రతా కారణాల దృష్ట్యా కఠినంగా వ్యవహరించాల్సి వస్తోందని తెలిపారు. "ఈ టోర్నమెంట్‌ను అడ్డం పెట్టుకుని ఇరాన్ తమ ఉగ్రవాదులను అమెరికాలోకి పంపే ప్రయత్నాలను అనుమతించం" అని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత ప్రణాళిక ప్రకారం, ఇరాన్ జట్టు మెక్సికోలోనే ఉంటూ మ్యాచ్‌లు ఉన్నప్పుడు మాత్రమే మల్టిపుల్-ఎంట్రీ వీసాలతో అమెరికాకు వచ్చి వెళుతుంది. జూన్ 15న న్యూజిలాండ్‌తో, జూన్ 21న బెల్జియంతో లాస్ ఏంజిల్స్‌లో, జూన్ 26న ఈజిప్టుతో సియాటిల్‌లో ఇరాన్ తలపడనుంది. ఒక ఆతిథ్య దేశం, టోర్నీలో పాల్గొంటున్న మరో దేశంతో యుద్ధంలో ఉండటం వరల్డ్ కప్ చరిత్రలో ఇదే తొలిసారి కావడం గమనార్హం. కాగా, ఫిఫా వరల్డ్ కప్-2026కి అమెరికా, కెనడా, మెక్సికో దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న సంగతి తెలిసిందే.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

## 'రామాయణ'లో కీలకపాత్ర .. అధికారికంగా వెల్లడించిన కాజల్



**నితేష్ తివారీ 'రామాయణం' చిత్రంలో నటిస్తున్నట్లు కాజల్ అగర్వాల్ ధృవీకరణ**

**రావణుడి భార్య మండోదరి పాత్రలో కనిపించనున్న నటి**

**రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్**

బాలీవుడ్ దర్శకుడు నితేష్ తివారీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'రామాయణం'లో తాను నటిస్తున్నట్లు వస్తున్న వార్తలపై నటి కాజల్ అగర్వాల్ స్పష్టతనిచ్చారు. ఈ భారీ ప్రాజెక్టులో తాను భాగమైనట్లు ఆమె ధృవీకరించారు. ఇటీవల జరిగిన ఒక అవార్డుల కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, ఈ చిత్రం కోసం తాను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా కాజల్ మాట్లాడుతూ, "భారతదేశంలో ఇంతకుముందెన్నడూ చూడని అద్భుతమైన సాంకేతిక హంగులతో ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. ఇది నా కెరీర్‌లో ఒక మైలురాయిలా నిలిచిపోతుంది" అని వ్యాఖ్యానించారు. ఈ చిత్రంలో రావణుడి భార్య మండోదరి పాత్రలో కాజల్ కనిపించనున్నారు. 'రామాయణం'లో శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయిపల్లవి నటిస్తుండగా, రావణుడి పాత్రలో కన్నడ స్టార్ యశ్ నటిస్తున్నారు. వీరితో పాటు హనుమంతుడి పాత్రను సన్నీ డియోల్ పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేయనుండగా, తొలి భాగాన్ని 2026 దీపావళి కానుకగా, రెండో భాగాన్ని 2027లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్రబృందం లక్ష్యంగా పెట్టుకుంది.

## ఎమ్మెస్ సుబ్బులక్ష్మి పాత్రలో రష్మిక...!


**ప్రముఖ గాయని ఎమ్మెస్ సుబ్బులక్ష్మి బయోపిక్‌లో రష్మిక మందన్న**

**'జెర్సీ' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఈ ప్రాజెక్ట్**

**ఇటీవల రష్మికపై సీక్రెట్ గా లుక్ టెస్ట్ నిర్వహించిన చిత్రబృందం!**

**గతంలో సాయి పల్లవి, రుక్మిణి వసంత్ పేర్లు పరిశీలన**

భారతదేశం గర్వించే ప్రఖ్యాత కర్ణాటక సంగీత విద్వాంసురాలు, భారతరత్న ఎమ్మెస్ సుబ్బులక్ష్మి జీవిత కథ ఆధారంగా ఓ భారీ బయోపిక్ రాబోతున్న సంగతి తెలిసిందే. జాతీయ అవార్డు గ్రహీత, 'జెర్సీ' చిత్ర దర్శకుడు గౌతమ్ తిన్ననూరి ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు దర్శకత్వం వహిస్తున్నారు. అయితే, ఈ సినిమాలో ప్రధాన పాత్ర పోషించేది ఎవరనే దానిపై నెలకొన్న సస్పెన్స్‌కు తెరపడినట్లు తెలుస్తోంది. ఈ అరుదైన అవకాశం 'నేషనల్ క్రష్' రష్మిక మందన్నను వరించినట్లు సమాచారం. ఫిల్మ్ నగర్ వర్గాల ప్రకారం, ఇటీవల చిత్రబృందం రష్మికపై రహస్యంగా ఒక లుక్ టెస్ట్ నిర్వహించింది. సాంప్రదాయ గెటప్‌లో రష్మిక అద్భుతంగా సరిపోయిందని, ఆమె హావభావాలు చూసి దర్శకుడు గౌతమ్ తిన్ననూరి పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారని తెలుస్తోంది. దీంతో ఈ పాత్రకు ఆమెను దాదాపు ఖరారు చేసినట్లు ఇండస్ట్రీలో ప్రచారం జరుగుతోంది. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. నిజానికి ఈ బయోపిక్ ప్రకటించినప్పటి నుంచి కథానాయికగా పలువురి పేర్లు వినిపించాయి. మొదట సాయి పల్లవి, ఆ తర్వాత కన్నడ నటి రుక్మిణి వసంత్ పేర్లను పరిశీలించినట్లు వార్తలొచ్చాయి. అయితే, తాజా పరిణామాలతో వారందరినీ వెనక్కి నెట్టి రష్మిక ఈ అవకాశాన్ని దక్కించుకున్నట్లు కనబడుతోంది. ప్రస్తుతం పలు క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న రష్మిక కెరీర్‌లో ఈ బయోపిక్ ఒక మైలురాయిగా నిలిచిపోతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.





## జాన్వీ కపూర్ తప్పు లేదు.. 'పెద్ది' వివాదంపై నటి మేకప్ ఆర్టిస్ట్ పోస్ట్

**కపూర్‌ను అతిగా గ్లామరైజ్ చేయడంపై కొనసాగుతున్న వివాదం**

**ఆమెకు మద్దతుగా ఇన్‌స్టాగ్రామ్‌లో మేకప్ ఆర్టిస్ట్ సవ్లీన్ కౌర్ పోస్ట్**

**షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ సమయంలో సదరు జూమ్ షాట్లపై జాన్వీ అభ్యంతరం వ్యక్తం చేసినట్లు వెల్లడి**

**నటి అభ్యంతరాలను పట్టించుకోకుండా ఫైనల్ ఎడిట్‌లో ఆ సీన్లను ఉంచేసిన చిత్ర బృందం**

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా నటించిన 'పెద్ది' సినిమా బాక్సాఫీస్ వద్ద రూ. 236 కోట్లకు పైగా వసూళ్లతో దూసుకుపోతున్నప్పటికీ.. హీరోయిన్ జాన్వీ కపూర్ (అచ్చియమ్మ పాత్ర)ను చూపించిన విధానంపై వివాదం మాత్రం సలసలా మరుగుతూనే ఉంది. సినిమాలో జాన్వీ శరీరాన్ని, నడుము భాగాన్ని జూమ్ చేస్తూ కెమెరా యాంగిల్స్ పెట్టడంపై ప్రేక్షకులు దర్శకుడిపై మండిపడుతున్నారు. అయితే, ఈ వివాదంలో జాన్వీని నిందించాల్సింది ఏమీ లేదని, ఆమెకు ఈ సీన్లు ఇష్టం లేకపోయినా బలవంతంగా ఉంచారని చెబుతూ ఆమె పర్సనల్ మేకప్ ఆర్టిస్ట్ సవ్లీన్ కౌర్ మన్‌చందా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. జాన్వీతో చాలా కాలంగా పనిచేస్తున్న సవ్లీన్ కౌర్.. తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో ఈ విషయమై స్పందించారు. "హీరోయిన్లు చేసే పాత్రలను బట్టి వారిని తప్పుబట్టడం చాలా సులువు. కానీ తెరవెనుక అసలు ఏం జరిగిందనే టైమ్‌లైన్ వేరేలా ఉంటుంది" అని ఆమె పేర్కొన్నారు. షూటింగ్ సమయంలోనే కాకుండా, పోస్ట్ ప్రొడక్షన్ (డబ్బింగ్, ఎడిటింగ్) సమయంలోనూ తన శరీరాన్ని జూమ్ చేసి చూపే కెమెరా యాంగిల్స్ పట్ల జాన్వీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిందని, ఒక ప్రొఫెషనల్‌గా నటీనటులకు ఉండాల్సిన హద్దుల గురించి గట్టిగానే మాట్లాడిందని సవ్లీన్ స్పష్టం చేశారు.

రామ్ చరణ్ సపోర్ట్.. లీకైన చాట్స్

ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం.. షూటింగ్ సమయంలో నడుము, నాభి భాగాలపై జూమ్ షాట్లు తీస్తున్నప్పుడు జాన్వీ కపూర్ అసౌకర్యానికి గురైందని, ఆ సమయంలో కో-స్టార్ రామ్ చరణ్ కూడా ఆమెకు మద్దతుగా నిలిచి దర్శకుడితో మాట్లాడారని తెలుస్తోంది. అయినప్పటికీ, జాన్వీ మాటలను పక్కనపెట్టి ఫైనల్ ఎడిటింగ్‌లో ఆ సీన్లను అలాగే ఉంచేశారని, సినిమా విడుదలయ్యాక వివాదం రేగడంతో ఇప్పుడు ఆ తప్పు నటిపైకి నెట్టేలా ప్రచారం సాగుతోందని సవ్లీన్ ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి సంబంధించిన కొన్ని లీకైన వాట్సాప్ చాట్స్ కూడా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. సినిమా జూన్ 4న విడుదలైన తర్వాత మహిళలను ఇలా అందాల వస్తువుగా చూపించడంపై నటి నిత్య మీనన్ వంటి తారలు కూడా విమర్శలు గుప్పించారు. వివాదం ముదరడంతో దర్శకుడు బుచ్చిబాబు సానా ఇప్పటికే ప్రేక్షకులకు బహిరంగ క్షమాపణలు చెప్పి, థియేటర్ల నుండి దాదాపు 3 నిమిషాల అభ్యంతరకర సీన్లను తొలగించారు. కాగా, ఈ వివాదంపై జాన్వీ కపూర్ ఇప్పటివరకు నేరుగా ఎలాంటి ప్రకటన చేయలేదు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ;  TELTEL-2O23/85680, Cel1 No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com